క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: సోమేశ్వరంలో ఆదివారం సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు, సత్తి వారి వంశీకుల ఆరాధ్యదైవంగా ఉన్న అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అందరినీ చల్లగా కాపాడమ్మాని కోరుతూ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కాలేజీ బస్సు దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న బస్సు

కె.గంగవరం: మండలంలోని తాళ్లపోడు గ్రామంలో పార్కు చేసి ఉన్న యానాంకు చెందిన రవి జూనియర్ కాలేజీ బస్సు ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైంది. ఎస్సై జానీ బాషా తెలిపిన వివరాల ప్రకారం గత ఐదేళ్లుగా ఇదే ప్రాంతంలో బస్సును పార్కు చేస్తున్నారు. ఉదయం ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతై బస్సు 50 శాతానికి పైగా కాలిపోయింది. ప్రమాద కారణాలు తెలియరాదు. దీనిపై కాలేజీ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు ఫిర్యాదు మేరకు కె.గంగవరం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన యోగా శిక్షణ



యోగా గురువు దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనవరి 28న ప్రారంభమైన యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. 21 రోజుల పాటు నిర్వహించిన తరగతుల్లో యోగా ప్రాధాన్యం, యోగాలోని ఆరోగ్యం, ఆధ్యాత్మిక అంశాలపై యోగా గురువు ములకల రామకృష్ణారావు వివరించారు. ముగింపు కార్యక్రమానికి జెడ్పీటీసీ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీపీ శాకా బాబీ హాజరయ్యారు. యోగా గురువు రామకృష్ణారావు, అన్నపూర్ణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో యోగాలో శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లోని ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న పలువురుని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. పట్టణ పరిధి రెండో వార్డులోని ముత్తారెడ్డి శ్రీనివాస్, ఏడిదకు చెందిన సిద్ధాంతపు రవి, పైడిమళ్ళ సుబ్బాయమ్మల కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్నిస్తాయని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండపేట పట్టణంలోని వేగుళ్ల సూర్యారావు ఉన్నత పాఠశాలలో ఆదివారం క్రీడాపోటీలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసానికి, ఆరోగ్యానికి తైక్వాండో ఎంతో అవసరమని హెచ్ఎం కడలి సాయిరామ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి 88 మంది క్రీడాకారులు గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్నారన్నారు. అర్జునరావుతో పాటు సీనియర్ కోచ్ కె.సత్యనారాయణల పర్యవేక్షణలో గ్రేడ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఎల్లో, ఎల్లో 1, గ్రీన్, గ్రీన్ 1, బ్లూ, బ్లూ 1, రెడ్ బెల్ట్‌ల గ్రేడింగ్ సంబంధించి 88 మంది బెల్ట్ గ్రేడింగ్ పొందారు. కార్యక్రమంలో బి.కుష్వీర్, పి.మణికంఠ, పితాని భార్గవిశ్రీకళ, కె.రమేష్, టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎరువు.. మోతాదు మించితే బరువు

- అవసరమైన మేరకే వినియోగించాలంటున్న నిపుణులు
- విచక్షణారహితంగా వాడితే చీడపీడలు విజృంభించే ప్రమాదం



కె.గంగవరంలో వరిపైరు

కె.గంగవరం: పంట దిగుబడి పెంచడంతో ఎరువులు పాత్ర చాలా కీలకం. సార్వా పంట కంటే దాళ్వాలో రైతులు ఎక్కువగా ఎరువులను వినియోగిస్తుంటారు. అయితే వరిపైరులో అవసరమైన మేరకు ఎరువులు వినియోగించాలని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడి సాధించాలనే తపనతో రైతులు మితిమీరిన ఎరువులు వేయడం వల్ల చీడపీడలు విజృంభించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గం 21,688 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. దీనిలో కె.గంగవరం మండలంలో 6344 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7702, రామచంద్రపురం మండలంలో 7642 హెక్టార్లలో ఈ పంటకు నాట్లు వేయడం వెదజల్లు విధానం ద్వారా పంట సాగు చేస్తున్నారు. ప్రతి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల పోషకాలతో పాటు జింక్, మెగ్నీషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు కూడా చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, పరసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మంచి విచక్షణా రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి తరుణంలో వివిధ రకాల ఎరువుల్లో ఉన్న పోషకాలు మోతాదు, వాటి ఉపయోగాలు, ఎరువులు వేయాల్సిన సమయంపై రైతులు అవగాహన ఏర్పరచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎకరా వరికి ఏమేం అవసరమంటే..

ఎకరం వరి పంటకు 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అవసరం. ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలోనూ. రెండో దఫా పిలకలు కట్టే దశలోనూ. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలోనూ వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని ఎరువు వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థవంతంగా పనిచేయాలంటే బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి 2 రోజులు నిల్వ ఉంచిన తరువాత పొలంలో చల్లుకోవడం వల్ల నత్రజని వినియోగం పెరిగి మొక్క దృఢంగా పెరుగుతుంది.

పైరులో సూక్ష్మపోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తరువాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 నుంచి 5 వారాల మధ్య పొలంలోని పాత నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

దిగుబడులపై ప్రభావం



ప్రస్తుత రోజుల్లో రైతులు సరైన అవగాహన లేక ఎక్కువగా ఎరువులు వాడుతున్నారు. పంట దిగుబడి ఎక్కువ సాధించేలనే తపనతో ఎక్కువ ఎరువులు వాడకం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎరువుల అధిక వినియోగం వల్ల ఖర్చు పెరగడమేకాక చీడపీడలు ఆశించి దిగుబలు తగ్గిపోయే ప్రమాదముంది. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనల మేరకు ఎరువులు వినియోగిస్తూ రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– బలుసు రవి, ఏఓ, కె.గంగవరం

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



కేదారిలంకలో ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మండలంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో గ్రామీణులకు ఆరోగ్యశ్రీ కార్డుల వినియోగంపై అవగాహన కల్పించారు. మండలంలో 21,63 కార్డులను పంపిణీ చేయాల్సి ఉండగా ఆదివారం ఒక్క రోజే 596 కార్డులను అందజేశారు. అత్యధికంగా టేకి 2 సచివాలయం పరిధిలో 60 కార్డులు, కపిలేశ్వరపురంలో 59, మాచరలో 57, కేదారిలంక, కాలేరులలో 43 చొప్పున, వల్లూరులో 39, పడమర ఖండ్రికలో 31, వాకతిప్పలో 30 కార్డులను అందించారు.

నేడు రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారి లంకలోని చేరిగూడెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీరాముని విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించనున్నారు. ఈ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేశారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



వడ్లమూరులో ప్రభుత్వ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్య, వైద్య సేవలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వడ్లమూరులో ఆదివారం పలు ప్రభుత్వ భవనాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి దుర్గారావు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, సర్పంచ్ చుండ్రు మంగాయమ్మలతో కలిసి భవనాలను ప్రారంభించారు. రూ.20.80లక్షలతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య ఉపకేంద్రం, రూ. 25 లక్షలతో నిర్మితమైన బీసీ సామాజిక భవనం, రూ.14.50లక్షలతో నిర్మించిన రజక కమ్యూనిటీహాల్ భవనాలను ప్రారంభించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. చుండ్రు చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, ఎంపీటీసీలు పలివెల మధు, పెందుర్తి శిరీష, పీఏసీఎస్ చైర్మన్ చుండ్రు అమ్మన్న, మండపేట రూరల్ ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శీలం గోవింద్, వడ్లమూరు గ్రామ అధ్యక్షుడు కొల్లాటి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మహిళలకు రుణమాఫీ చెక్కుల పంపిణీ



వడ్లమూరు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: అన్ని వర్గాల మహిళలకు ఆసరాగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మండలంలోని నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాలకు చెందిన వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వడ్లమూరులో సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, పెందుర్తి శిరీష, పీఏసీఎస్ చైర్మన్ చుండ్రు అమ్మన్న మాట్లాడుతూ మహిళాభ్యుదయం సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. పేదలకు మేలు చేసిన ధైర్యంతో సీఎం జగన్ మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులు వెంటాడినా ప్రభుత్వం పేదల పథకాలను ఆపలేదన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నియోజకవర్గానికి చేసిందేమీలేదని, వ్యాపారస్తుడైన జోగేశ్వరరావుకు సేవచేసే అలవాటు లేదన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. డబ్బును నమ్ముకున్న ప్రతిపక్షానికి ప్రజలను నమ్ముకున్న అధికార పక్షానికి మధ్య జరిగే రానున్న పోరులో ప్రజలంతా మంచి వైపు నిలవాలని కోరారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఏపీఎం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిడసనమెట్ట గ్రామంలోని 33 సంఘాల పరిధిలోని 330 మంది సభ్యులకు నాలుగో విడతగా రూ.27,64,424 రుణ మాఫీ సొమ్ము ఖాతాలకు జమ చేసిందని, నాలుగు విడతలు మొత్తంలో రూ.1,10,57,708 రుణమాఫీగా ప్రభుత్వం సాయమందించిందన్నారు. వడ్లమూరులో 33 సంఘాల పరిధిలోని 330 మంది సభ్యులకు నాలుగో విడతగా రూ.30,53,246 వారి ఖాతాలకు జమ అయ్యిందన్నారు. నాలుగు విడతల్లో మొత్తం రూ.1,22,12,984 రుణమాఫీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో మండపేట రూరల్ ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవింద్, వడ్లమూరు గ్రామ అధ్యక్షుడు కొల్లాటి సురేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే జీవన ప్రమాణాల మెరుగుదల



గొల్లపాలెం పర్యటనకు వచ్చిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

కాజులూరు: రాష్ట్రంలో పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో ఎంపీ పిల్లి సుభాస్‌చంద్రబోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలుసుకున్నారు. పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా పేదలకు కలుగుతున్న లబ్ధిని వివరిస్తూ వాటిని వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని గతంతో ఎన్నడూ లేనంత విధంగా ఈ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. సంక్షేమాన్ని ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చేందుకు వలంటీరు వ్యవస్థను, సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. గ్రామంలోని వైఎస్సార్ నగర్‌లో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యలను స్థానిక మహిళలు ఎంపీ బోస్ దృష్టికి తీసుకురాగా త్వరలో వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, నిమ్మితి విజయ్, చొల్లంగి వెంకన్న, టేకుమూడి దుర్గారావు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలన ఒక సువర్ణాధ్యాయం

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్
- వివిధ పార్టీల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులకు కండువాలు వేసి స్వాగతం పలుకుతున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: రాష్ట్ర చరిత్రలో సీఎం జగనన్న పాలన ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, బందనపూడి మాజీ సర్పంచ్ జక్కన రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం బందనపూడి, మతుకుమిల్లి గ్రామాలకు చెందిన పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు సుమారు 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రాజ్యసభ సభ్యుడు బోస్ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నామన్నారు. అనంతరం రాజేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన మతుకుమిల్లి మాజీ సర్పంచ్ ఆకుమర్తి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రానున్న ఎన్నికల్లో పార్టీ మరోసారి విజయం సాధించి అధికారంలోకి వచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు.

ప్రజా పోరు యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శంకరనారాయణ

రామచంద్రపురం: బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు తలపెట్టిన ప్రజా పోరు యాత్రను విజయవంతం చేయాలని రామచంద్రపురం అసెంబ్లీ కన్వీనర్ దూడల శంకరనారాయణ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలో హోటల్ రెటిన్యూలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రజా పోరుయాత్ర-2 పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్ బొంతు శివాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా పోరు-2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నియోజకవర్గ కన్వీనర్ శంకరనారాయణ మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలను వివరిస్తూ రాబోయే ఎన్నకల్లో బీజేపీకి మద్దతు పలకాలని వివరించేందుకు పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజా పోరుయాత్ర కోకన్వీనర్స్ కేశవ రాఘవేంద్రరావు, సలాది సతీష్ నాయుడు, టెలికం అడ్వైజరీ బోర్డు మెంబర్ గుర్రాల సత్యనారాయణ, ఎంపీటీసీ కొప్పన లక్ష్మి, జిల్లా కార్యదర్శి తలాటం అమ్మాజీ, కె.గంగవరం మండల అధ్యక్షుడు అవసరాల వెంకటరమణమూర్తి, రూరల్ అధ్యక్షుడు శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కులపాకుల వెంకటరమణ, ట్రేడర్ సెల్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, రూరల్ మండలం ఉపాధ్యక్షుడు వెన్నపు ధనరాజు, ఓబీసీ మోర్చా టౌన్ అధ్యక్షులు సురేష్ కుమార్, సూర్యనారాయణ సుబ్రహ్మణ్యం, గుబ్బల శ్రీనివాసు గోపి తదితరులు పాల్గొన్నారు.

జనార్దనస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలకు అంకురార్పణ పూజ చేస్తున్న అర్చకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని భూదేవీ, శ్రీదేవీ సమేత జనార్దనస్వామి కల్యాణోత్సవం ఆదివారం అంకురార్పణతో ప్రారంభమైంది. ఆలయ అర్చకులు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు, గోపాలకృష్ణమాచార్యులు, పర్యవేక్షణలో అర్చకుల బృందం స్వామికి పంచామృతాభిషేకం, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సదాపతి జయబాబు, సభ్యులు టపా పుల్లేశ్వరరావు, ఈఓ కామేశ్వరరావు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో అన్న ప్రసాద భవనం ప్రారంభం



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో అన్నప్రసాద భవనం ప్రారంభించిన దాత, నాయకులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దాతలు, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు సత్తి సుబ్బారెడ్డి, కుమారులు సూర్యనారాయణరెడ్డి, సత్తిరెడ్డిలు నిర్మించిన అన్న ప్రసాద భవనం ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ముందుగా సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం, సూర్యనారాయణరెడ్డి, ఉమాదేవి, సత్తిరెడ్డి, శ్రీకాంతలక్ష్మి దంపతులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి భవనాన్ని ప్రారంభించారు. భక్తులకు నూతన భవనంలో అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా దాత సత్తి సుబ్బారెడ్డి మాట్లాడుతూ చాలా కాలంగా భీమేశ్వరాలయ ప్రాంగణంలో అన్న ప్రసాద భవన నిర్మించాలన్న కోరిక ఈ ప్రభుత్వంలో నెరవేరిందన్నారు. అందుకు సహకరించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



పెదపట్నంలంకలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత బాల వీరభద్రేశ్వర స్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మాఘ శుద్ధ నవమి ఉదయం 10.42 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త మేష లగ్నంలో గంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవం కనుల పండువగా జరిపించారు. శిరిగినీడి గోపీనాథ్, హేమజ్యోతి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పుణ్యాహవాచనం అనంతరం స్వామి వార్ల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలను భక్తుల కోలాహలం నడుమ ఘనంగా జరిపించారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణంలో పలువురు దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. మహదాశీర్వచనం అనంతరం అఖండ అన్న సమారాధన జరిగింది. పాశర్లపూడి ఉత్తరబాడవలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీదేవికి పెన్నులు, పుస్తకాల పూజ



వాడపాలెంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో అయ్యప్ప స్వామి, జ్ఞానసరస్వతీదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, పెన్నులు, పుస్తకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపంచమి, శ్యామల నవరాత్రిలో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారు బులితాత, ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు దొంతికుర్తి రామచంద్రశర్మ విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలతో పాటు పెన్నులు, పుస్తకాలతో పూజించారు.

పక్షవాతం బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసినట్టు ఆదివారం సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన మిరియాల ఖాదర్‌బాబు (63) పక్షవాతంతో బాధపడుతున్నాడు. బుర్ర కథలు చెప్పుకుంటూ జీవనం సాగించే వీరికి వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడంతో సాయం చేయమని కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. దీంతో ఖాదర్ బాబుకి రూ.10 వేల నగదును సేవా సంస్థలు అందజేశారు.

నేడు వెంకన్న కల్యాణం

అంబాజీపేట: పుల్లేటికుర్రు గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త బచ్చు సుబ్రహ్మణ్యగుప్తా తెలిపారు. స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణ, పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోటరీ సేవలు స్ఫూర్తిదాయకం

రాజోలు: రోటరీ సేవలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా ఎన్నికైన బొరుసు వెంకట తిరుమలరావు అన్నారు. ఆదివారం ఆయనను రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడిద కవీంద్ర, లక్ష్మణరావుల ఆధ్వర్యంలో రొటేరియన్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ రాజోలు, ముమ్మిడివరం, అమలాపురం, కొత్తపేట రోటరీక్లబ్‌ల సమన్వయంతో రోటరీ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తానన్నారు. రొటేరియన్లు తణుకు శ్రీనివాసరావు, అడబాల నాని, తిక్కిశెట్టి లక్ష్మీనారాయణ, బోళ్ల పూర్ణ చంద్రరావు, లక్కింశెట్టి రత్నబాబు, మొహిద్దీన్ కిష్వర్, నామన షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.